# రామేశ్వరం పోయినా...

ఆ రోజు కూడా అందరూ మర్రిచెట్టు నీడన ఆశీనులైన సమయంలో సూతుడు శౌనకాది మునులను చూసి, కథా కాలక్షేపం కొనసాగించటానికి ఉపక్రమించి గొంతు సర్దుకున్నాడు.

"నాకో చిన్న అనుమానం స్వామీ" అన్నది చెట్టు మీద రామచిలుక, తన ఎర్రటి నోరు తెరచి సన్నటి గొంతుతో.

సూతుడు చిరునవ్వు నవ్వి, తల పైకెత్తి, గాలికి ఎగురుతున్న గడ్డాన్ని చేత్తో దువ్వుకుని, "ఏమిటి నీ అనుమానం" అని అడిగాడు.

"ఏమీ లేదు! ఏ కాలెండర్లో చూసినా, పురాణాల్లో చదివినా, విష్ణుమూర్తి ఎప్పుడూ ఆదిశేషయ్య అండ్ కో వారి మంచం మీద పడుకునే వుంటాడు.ఆయన మోచేయికి నొప్పి పుట్టదో ఏమో కానీ, ఆయన చేయి ఆ తల క్రింద అలానే కొన్ని యుగాలనించీ వుంటున్నది. మరి లక్ష్మీదేవేమో అన్ని యుగాలనించీ, ఆయన కాళ్ళు పిసుకుతూనే వుంటుంది. మరి ఆయన ఎక్కువేమిటీ, ఈవిడ తక్కువేమిటీ.. "

చిన్నముని చటుక్కున అన్నాడు "బాపూ, ముళ్ళపూడి వెంకటరమణగారి సినిమాలో డైలాగది. ఆరుద్రగారు.... ఆ మధ్యనే స్వర్గానికి వెళ్ళిన పుణ్యాత్ముడు... ఆ మాటనే పల్లవిగా తీసుకుని చక్కటి పాట కూడా వ్రాశారు. అదేదో నీ స్వంతమయినట్టు చెబుతున్నావు... "

శుకమహర్షి తన చిలుక ముక్కుని టపటపలాడించాడు. "చిన్నమునీ! నువ్వు అసలు పాయింటుకి రాకుండా, ఏవేవో కబుర్లు చెబుతున్నావు. ఆ చిగురాకులలో చిలకమ్మ చెప్పేది విను" అని చిలుక వేపు తిరిగి,"ఏమ్మా! చిలకమ్మా! నువ్వు చెప్పు" అని అడిగాడు.

"ఏమీ లేదు మహర్షీ! ఆవిడ అలా యుగయుగాల నించీ ఆయన కాళ్ళు పడుతూనేవుంది. ఆవిడ కూడా మరి సామాన్యురాలు కాదు. సాక్షాత్తూ లక్ష్మీదేవి. అందరికీ సిరిసంపదలు ప్రసాదించే లక్షీదేవి. మరేమిటి ఈ సృష్టిలో విచిత్రం?" అన్నది చిలకమ్మ.

చిలుక పలుకులు విన్న సూతుడు, ఆ చిలుక దూరదృష్టికి ముందు ఆశ్చర్యపడి, తర్వాత ఆ చిలకమ్మ తెలివితేటలకు సంతోషించి, ఒక్కక్షణం మౌనం వహించాడు.

శౌనకాది మహామునులూ, సకల జంతుజాలమూ, నిశ్శబ్దంగా సూతుడి వేపు చూశారు.

సూతుడు అలా ఒకసారి భారతదేశం వేపు దృష్టి సారించి, మళ్ళీ అమెరికా వేపు కొద్ది క్షణాలు పరికించి చూశాడు. ఆయన పెదవుల మీద చిరునవ్వు మెరిసి, వెంటనే మాయమయింది.

అలవాటు ప్రకారమో కొంచెం దురదొఎడుతున్నదో తెలీదుకానీ మళ్ళీ ఒకసారి చేత్తో గడ్డాన్ని దువ్వుకుని, సూతుడు శౌనకాది మహామునులకి కథ చెప్పటం కొనసాగించాడు.

"పూర్వం భారతదేశంలో కన్యాశుల్కమనే ఒక దురాచారం వుండేది. అంటే మగవాళ్ళు పెళ్ళిచేసుకోటానికి, ఆడపిల్లల తండ్రులకు చెల్లించే డబ్బన్నమాట. అది వినటానికి చాల బాగా వుంటుంది కానీ, ఆ కన్యాశుల్కం ఆడపిల్లల పాలిట గుది బండ అయింది. డబ్బులిచ్చి ఆడపిల్లల్ని మగవాళ్ళు కొనుక్కునే వాళ్ళు కనుక, అదొక ఆరాచకంగా మారింది. చిన్నపిల్లల్నీ, చితక పిల్లల్నీ వయసులో ఎంతో ముసలివాళ్ళూ ముతకవాళ్ళూ, కాటికి కాళ్ళు చాచుకు కూర్చున్న వాళ్ళూ, డబ్బులిచ్చి పెళ్ళి చేసుకునే వాళ్ళు. డబ్బులకి ఆశపడి ఆ పిల్లల తండ్రులు, ఆ పసికందుల జీవితాల్ని బూడిదపాలు చేసేవాళ్ళు. బూడిద అంటే.. ఆ ఆడపిల్లల్లో చాల మంది ఎదగక ముందే, ముసలి మొగుళ్ళు చనిపోవటంతో, వాళ్ళని శాశ్వతంగా తగలేసిన బూడిద. అంతే కాదు. వాళ్ళల్లో ఎందరో సంసారసుఖం కూడా పూర్తిగా చవిచూడని వాళ్ళు. సంఘంలో వాళ్ళ జీవితం నరకప్రాయంగా తయారయేది..."

"ఈనాటికీ ఆ ఆచారం అలానే వుందా?" అని అడిగింది, పచ్చటి రామచిలుకను, కన్నార్పకుండా చూస్తున్న ముసలి గోరింక.

సూతుడు అదోలా నవ్వి అన్నాడు "లేదు. భారతదేశంలో మగవారి అవసరాల దృష్ట్యానూ, సందర్భానుసారంగానూ, దురాచారాలూ, అనాచారాలూ, అత్యాచారాలు, ఆచారాలుగా మారటం తరతరాలుగా చూస్తున్నదే. అందుకే ఈ దురాచారం ఇంకో రూపం దాల్చి ఇంకా పెద్ద అనాచారమయింది. అదే కట్నమనే ఆచారం. మగవాళ్ళు ఆడవాళ్ళని కన్యాశుల్కంతో కొనుక్కోవటం పోయి, ఇప్పుడు ఆడవాళ్ళు మగవాళ్ళని కట్నంతో కొనుక్కుంటున్నారు.

"మరింకేం! ముసలివాళ్ళయిన ఆడవాళ్ళందరూ పడుచుకుర్రాళ్ళని కొనుక్కుని, పెళ్ళిచేసుకోవచ్చు కదా!" అన్నది చెట్టు మీద కూర్చున్న వృద్ధ రామచిలుక, ఎగరలేక అవస్థ పడుతున్న బుల్లి గోరింకను చూస్తూ.

"ఇక్కడ గమ్మత్తేమిటంటే, అలా జరగటం లేదు. మగవాడు ఆడవాళ్ళ దగ్గర అంతులేని డబ్బు కట్నం పేరుతో గుంజి, ఆడపిల్ల తల్లిదండ్రులని వేధించుకు తినటం మొదలయింది. ఇప్పుడు ఆడపిల్లలు కూడా, బాగా చదువుకోవటంమొదలు పెట్టాక, ఈ కట్నాల ఆచారం ఇంకా ఘోరంగా తయారయింది. అటు లక్షల్లో కట్నం దోచుకోవటమే కాకుండా, తన భార్య చేత బయట కూడా ఉద్యోగం చేయించి ఇంకా ఎక్కువ డబ్బు పోగుచేసుకుంటున్నాడు. అంటే ఇక్కడ మీకేమిటి అర్ధమవుతున్నది?" అడిగాడు సూతుడు.

చెట్టు మీది నల్ల కోతి అర్థం కాక జుట్టు పీక్కుటుంటే, ఎర్ర కోతి బుర్ర గోక్కుంటూ అమాయకంగా అంది, "అంటే సాక్షాత్తూ లక్షీదేవి చేత కాళ్ళు పిసికించుకుంటున్న విష్ణుమూర్తులన్న మాట ఈ మగవాళ్ళు"

చిన్న ముని ధైర్యం చేసి అన్నాడు, "నేను చెప్పనా" అని.

"చెప్పు బాబూ! చెప్పు!" అన్నాడు శౌనకుడు, గుమ్మడి వెంకటేశ్వర్రావ్‌లాగా నెమ్మదిగా.

"నాకు ఈ రెండు దురాచారాల్లోనూ, మగవాళ్ళు ఆడవాళ్ళని దోచుకోవటమే కనిపిస్తున్నది. ఇక్కడి సమస్య, కన్యాశుల్కం కాదు. కట్నమూ కాదు. సమాజంలో మగవాళ్ళ ఆధిక్యత... ఆడవాళ్ళ అసహాయత.. " అన్నాడు చిన్నముని చిన్నగా.

అతని మాటలకి, మహర్షులూ జంతుజాలమూ ఆశ్చర్య పోతే, చెట్టూ చేమలన్నీ మారుతి ప్రోత్సాహంతో తలలు వూపాయి.

స్పందిస్తున్న ప్రకృతిని చూసి, శుక మహర్షి చిరునవ్వు నవ్వి, "చిన్నమునివయినా, పెద్దవారికందని నిజాన్ని చెప్పావు నాయనా! నువ్వు తొందరగా ఎదుగుతున్నందుకు సంతోషంగా వుంది. అంతేకాదు. మన ఎర్రకోతి చెప్పిందే...సాక్షాత్తూ లక్ష్మి

దేవి చేత కాళ్ళు పిసికించుకుంటున్న విష్ణుమూర్తులని. అదొక వరహాల మూట" అన్నాడు.

నల్ల కోతికి అవేమీ అర్థం కానందున, సూతుడ్ని సూటిగా అడిగింది. "మీరు అన్నాదుర్రై కథలు చెప్పకుండా, ఏవేవో చెబుతున్నారు" అన్నది.

"అన్నాదుర్రై కథలు కాదు. ఎన్నార్రై కథలు" సరిదిద్దాడు చిన్నముని.

"వస్తున్నాను. వస్తున్నాను" అన్నాడు సూతుడు సాలోచనగా.

ఒక్క క్షణం ఆగి, కథ చెప్పటం కొనసాగించాడు.

అమెరికాలో ఒక మహానగరంలో నిజంగా జరిగిందీ కథ. అక్కడే ఒక హైటెక్ కంపెనీలో ఇంజనీరింగ్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు నాగరాజు. అంతకు ముందు సంవత్సరమే అదే కంపెనీలో సాఫ్ట్‌వేర్ డిపార్ట్‌మెంట్లో చేరాడు భాస్కర్. భాస్కర్ బ్రహ్మచారి అవటం వల్ల, వారాంతాలు నాగరాజు శారదల ఇంటికి రావటం, తరచూ వాళ్ళింట్లో భోజనం చేయటం అలవాటయిపోయింది. ఉద్యోగంలో చేరిన ఆర్నెల్లకే, భాస్కర్ ఇండియా వెళ్ళి సరళని పెళ్ళిచేసుకుని వచ్చాడు. సరళా, భాస్కర్‌లు, నాగరాజూ, శారదలకు బాగా దగ్గరయారు. అంతే కాదు వాళ్ళ ఇంటికి చాల దగ్గరలో అపార్ట్‌మెంట్ కూడా అద్దెకు తీసుకున్నారు"

చిన్నముని అడ్డం వస్తూ అన్నాడు "మీరు ఈ కథని చకచకా నడిపిస్తున్నారు. ఎక్కడికి వెడుతుందో అర్థం కావటం లేదు"

"నువ్వు ఇలా అడ్డం వస్తే ఇక్కడే ఆగిపోతుంది కథ. ఆయన్ని చెప్పనీ" అన్నాడు శుకమహర్షి.

"వస్తున్నాను. అసలు కథ ఇక్కడే మొదలయింది. కథ కొనసాగించే ముందు, సరళ వ్యక్తిత్వం గురించికూడా తెలుసుకోవాలి. సరళ మంచి కలుపుగోలు మనిషి. చాల చక్కగా మాట్లాడుతుంది. ఇండియాలో వున్నప్పుడు చాల డిబేట్లల్లో బహుమతులు గెల్చుకోవటమే కాక, వాళ్ళ కాలేజీ స్టూడెంట్స్ యూనియన్‌కి ప్రెసిడెంట్‌గా కూడా పనిచేసింది. అటువంటి సరళ ఒకరోజు రాత్రి ఎనిమిది గంటలకి, నాగరాజు ఇంటికి వచ్చి కాలింగ్ బెల్ మ్రోగించింది. తలుపు తెరిచిన శారద, సరళని చూసి నిర్ఘాంతపోయింది. ఆమె నుదుటి మీద చిన్నగాయం. రక్తం గడ్డ గట్టినా, ఇంకా ఎర్రగా మెరుస్తూనే వుంది.

"ఏమిటి సరళా! కారు ఏక్సిడెంట్ అయిందా? భాస్కర్ ఏడీ?" అంటూ ఆమెని లోపలికి తీసుకు వచ్చింది శారద.

సరళ లోపలికి వచ్చి సోఫాలో కూర్చుంది కానీ, ఏమీ మాట్లాడలేదు.

శారద ఆమె దగ్గరికి వచ్చి "సరళా ఏమయింది?" అని అడిగింది మళ్ళీ.

సరళ ఒక్కసారిగా బావురుమంది. శారదకి ఏమీ అర్థం కాకపోవటమే కాక, ఏం చేయాలో కూడా తోచలేదు. వాళ్ళ మాటలు విని, మేడ మీద నించి వచ్చాడు నాగ రాజు.

చేతిలో పుస్తకం బల్లమీద పడేసి, "ఏమయింది సరళా? భాస్కర్ ఏడీ?" అని అడిగాడు గాభరాగా.

సరళ "నేను ఇంటికెళ్ళిపోతాన్లెండి. ఫర్‌గెటిట్!" అని ఒక్కక్షణం ఆగి "భాస్కర్ మళ్ళీ కొడతాడేమో.... " అంది అనాలోచితంగా, భయంభయంగా.

నాగరాజూ, శారదా నిర్ఘాంతపోయారు.

"భాస్కర్ నిన్ను కొట్టటమేమిటి సరళా" అంది శారద ఏమీ అర్థంకాక.

సరళ మాట్లాడలేదు.

నాగరాజు అన్నాడు "అసలేం జరిగింది. భాస్కర్ అంత విచక్షణాజ్ఞానం లేకుండా అలా ప్రవర్తించడే..."

ఇవాళ ఇద్దరం ఆఫీసు నించీ ఇంటికి వచ్చేసరకీ ఆరున్నర అయింది. ఆఫీసులో రోజంతా మీటింగులతోనే గడిచిపోయింది. ఒకటే తలనొప్పి. వంట చేయలేక బయట తిందామన్నాను. అది భాస్కర్‌కి నచ్చలేదు. నా మీద అరిచాడు. కొట్టాడు కూడాను.." నెమ్మదిగా అన్నది.

నాగరాజు ఆమె మాటలు నమ్మలేకపోతున్నాడు.

కాని ఆమె నుదిటి మీద నెత్తురే కాదు, ఆమె చెంప మీద ఎర్రగా కందిన చేతి ముద్రలు కూడా స్పష్టంగా కనిపిస్తున్నాయి.

"హవ్ బార్బారిక్.. " అన్నాడు నాగరాజు.

"ఆమాత్రం దానికే చేయి చేసుకోవాలా? అలా కొట్టటం సంస్కారం కాదే. అసలు ఎందుకు చేశాడిలా? ఇంతకు ముందు కూడా ఇలా జరిగిందా?" నెమ్మదిగా అడిగింది శారద.

"పెళ్ళయిన తర్వాత ఒకటి రెండు నెలలు బాగానే వున్నాడు. తర్వాత సూటి పోటి మాటలతో బాధించటం మొదలు పెట్టాడు. ఈమధ్య కొట్టటం కూడా మొదలు పెట్టాడు..."

"దేనికి? ఎందుకని? నువ్వు చిన్నపిల్లవి కావు అతనలా చేయి చేసుకోటానికి..." భాస్కర్ అలాటివాడని ఇంకా నమ్మలేకపోతున్నాడు నాగరాజు.

ఒక్కక్షణం తటపటాయించి సరళ నెమ్మదిగా అంది "భాస్కర్ ఇండియావచ్చి, నాతో పాటుగా ముగ్గురమ్మాయిల్ని పెళ్ళి చూపుల్లో చూశాడు. వాళ్ళల్లో ఇద్దరు మాక

న్నా ఎక్కువ కట్నం ఇస్తామన్నారుట. కానీ ఆ అమ్మాయిలిద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు కారుట. నేనయితే కొంచెం కట్నం తగ్గినా, ఇక్కడ ఉద్యోగంలో చేరి అతని బాంక్ బాలన్స్ పెంచుతానని అనుకున్నట్టున్నాడు. వెంటనే ఒప్పేసుకుని వారంరోజుల్లో పెళ్ళిచేసుకున్నాడు. అలాగే ఉద్యోగం చేసి, నా జీతం అంతా అతనికే ఇచ్చేస్తున్నాను. ఈ రోజు డాలర్లలో నా జీతం చూస్తే, అతను కట్నంలో నష్టపోయిన ఆ రెండు లక్షలూ ఒక లెక్కలోకి రావు. అయినా అతను ఎప్పుడూ అదే అంటుంటాడు. ప్రతిదానికీ నా మీద విసుక్కోవటం, అరవటం మొదలుపెట్టి, ఇప్పుడు కొట్టటం దాకా వచ్చింది... "వెక్కివెక్కి ఏడ్చింది సరళ.

"భాస్కర్‌లో ఆ మాత్రం సంస్కారం లేదంటే... ఉండు. ఇప్పుడు ఇంట్లో వున్నాడా? ఫోన్ చేయనా... " అన్నాడు నాగరాజు, ఫోన్ వేపు నడుస్తూ.

"వద్దండీ! మీరు కలుగజేసుకుంటే బాగుండదు" అంది సరళ. తనే వాళ్ళింటికి వచ్చి ఆ విషయం చెప్పింది కనుక, వెంటనే అంది. "నేను ఆ బాధలో ఏంచేస్తున్నానో తెలీక ఇక్కడికి వచ్చాను. మిమ్మల్ని ఆయనతో మాట్లాడమని చెప్పటానికి కాదు. మరేమీ అనుకోకండి. ఆయనకో విషయం తెలిస్తే మండిపడతాడు. మళ్ళీ కొడతాడు కూడాను.."

"ఇప్పుడెక్కడున్నాడు?" అడిగాడు నాగరాజు.

"ఏమో తెలీదు. నన్ను కొట్టి కోపంతో బయటికి వెళ్ళిపోయాడు"

ఇంతలోనే కాలింగ్ బెల్ మ్రోగింది.

"ఆయనేనేమో... " అంది సరళ భయంతో.

"ఉండు. నేను తలుపు తీస్తాను" అని వెళ్ళి తలుపు తీశాడు నాగరాజు.

భాస్కర్ నవ్వుతూ లోపలికి వచ్చాడు. "సరళ వుందా? ఇందాక బాత్ రూంలో పడిపోయింది. నేను ఫార్మసీకి వెళ్ళి ఏంటీసెప్టిక్ స్ప్రే తెచ్చి చూస్తే లేదు. ఇక్కడ వుందేమోనని వచ్చాను" అన్నాడు.

శారదకి అతన్ని లోపలికి ఆహ్వానించాలనిపించ లేదు.

నాగరాజుకి, భాస్కర్ చెప్పిన మాటలు అసహజంగా అనిపించాయి.

ఈలోగా సరళ లేచి, భాస్కర్‌తో "పదండి. వెడదాం" అని బయటికి నడిచింది. వెడుతూ వెడుతూ, "థాంక్స్. మళ్ళీ కలుద్దాం" అని వెళ్ళిపోయింది.

"సరళ ఎందుకలా చేసింది? సరళ చెప్పింది నిజమా భాస్కర్ చెప్పింది నిజమా" అని అడిగాడు చిన్నముని.

"ష్! ఇది అమెరికా బేతాళుడి కథ కాదు. ఎన్నారై కథ. అలాటి ప్రశ్నలు అడగకూడదు. ఆయనే చెబుతారు కదా" అన్నాడు శుకమహర్షి.

"ఆ ఒక్కరోజే కాదు. ఇలా నాలుగైదుసార్లు జరిగింది. ప్రతిసారీ సరళ ఎంతో ఉద్రేకంతో శారదా నాగరాజులకు తన కష్టాలు చెప్పుకోవటం, భాస్కర్ రావటంతోనే చల్లబడి మాటమార్చి, అతనితో వెళ్ళిపోవటం. ఒకసారి భాస్కర్ ఆఫీసు పనిమీద చికాగో వెళ్ళాడు. ఆరోజు రాత్రి సరళని, వాళ్ళింట్లోనే పడుకోమన్నది శారద.

"సరళా! నాగరాజుకి భాస్కరంటే ముందు నించీ ఎంతో ఇష్టం. ఈ విషయం విన్న తర్వాత అతనికేం చేయాలో పాలుపోవటం లేదు. నీ అనుమతి లేకుండా భాస్కర్‌తో మాట్లాడను అన్నాడు నాగరాజు. అసలు నువ్వు ఎందుకు వూరుకుంటున్నావో తెలుసుకోవాలని వుంది" అంది, సరళ భుజం మీద చేయి వేసి.

ఒక్క క్షణం ఆలోచించి సరళ అంది-"దానికి చాల కారణాలున్నాయి. ఒకటి మా నాన్న బాపట్లలోని మా ఇల్లు అమ్మేసి, అది అతనికి కట్నంగా ఇచ్చి నా పెళ్ళి చేశాడు. మా అమ్మా నాన్నకి వేరే ఆధారంకూడా ఏమీ లేదు. వాళ్ళు అంత త్యాగం చేసి నాకు పెళ్ళి చేస్తే, అది సంవత్సరం కూడా నిలవకపోతే, మా నాన్న గుండె ఆగిపోతుంది. మా అమ్మకి పిచ్చెత్తుతుంది. ఇక్కడ నా కాళ్ళ మీద నేను నిలబడాలంటే నాకు గ్రీన్ కార్డ్ లేదు. అది భాస్కర్‌తో ముడిపడివుంది. అదెన్నాళ్ళు పడుతుందో ఏమో! అంతేకాదు నా దగ్గర క్రెడిట్ కార్డులేవీ లేవు. నా జీతమంతా ప్రతి నెలా మా ఇద్దరి పేరున వున్న జాయింట్ ఎకౌంట్‌కి వెడుతుంది. ఆ మర్నాడే, అతను ఆ డబ్బుని తన ఒక్కడి పేరున మాత్రమే వున్న ఎకౌంట్‌కి మార్చేస్తాడు"

"అదేమిటి? ఎందుకలా చేస్తాడు. మరి నీఖర్చులకి?"

"నేను మా నాన్నకి డబ్బులు పంపిస్తానేమోనని భయం. అందుకని"

"రెడిక్యులస్! పోలీసులకి రిపోర్ట్ చేద్దాం.." అంది శారద.

"వద్దు. చెప్పానుగా. నాకిష్టం లేదు" అంది సరళ.

"పోనీ. నాగరాజు భాస్కర్‌తో మాట్లాడితే... అతనికి నాగరాజంటే అభిమానం వుంది"

"మీరేమి అనుకోకపోతే ఒక్కమాట. అభిమానం వుండేది. కానీ ఇప్పుడు లేదు. నేను మీకు ఆయన మీద చెబుతున్నానని అనుమానంగా వుంది. అందుకనే ఈ మధ్య.... నాగరాజుగారి గురించి కూడా చెడుగా మాట్లాడుతున్నాడు నాతో"

శారదకి ఏం చేయాలో అర్థం కాలేదు.

మర్నాడు శారద అదేమాట నాగరాజుతో అన్నప్పుడు "ఉండు. ఒకపనిచేద్దాం" అని తన మిత్రుడు హేమంత్ మెహతాకి ఫోన్ చేశాడు.

పిచ్చాపాటీ అయాక "నిరుపమ ఇంట్లో వుందా?" అని అడిగాడు.

"మాట్లాడతావా. వన్ మినిట్!" అని హేమంత్ ఫోన్ నిరుపమకి అందించాడు.

నిరుపమతో నాగరాజు, తను ఎవరి గురించి మాట్లాడుతున్నాడో చెప్పకుండా, జరిగిన విషయం చెప్పి, "నా స్నేహితురాలికి ఈ విషయంలో సహాయంచేద్దామనుకుంటున్నాను. మీ ఆర్గనైజేషన్ ద్వారా ఏంచేస్తే బాగుంటుంది"అని అడిగాడు.

నిరుపమ బాటర్డ్ అండ్ ఎబ్యూజ్డ్ వుమన్ అనే ఆర్గనైజేషన్‌లో వాలంటరీ వర్క్ చేస్తూ వుంటుంది. "డొమెస్టిక్ వయొలెన్స్" వల్ల బాధలు పడే ఆడవాళ్ళకి సహాయం చేసే సంస్థ అది.

"నాగరాజ్ భాయ్! ఆమె ప్రవర్తన, ఇలాటి పరిస్తితుల్లో మన భారతీయులు చాలమంది చేసే పద్ధతిలోనే వుంది. అంతే కాదు ఈ స్థితిలో బయట నించీ సహాయం తీసుకోటానికి కూడా నిరాకరిస్తారు. కారణం అభిమానం ఒక్కటే కాదు. ట్రెడిషనల్‌గా ఇలాటివి చూసి వుండటం వల్లా, ఆమె చెప్పిందన్నావే - అలాటి సాంఘిక కారణాల వల్లా... సాధారణంగా బయటపడరు"

"అంటే మనమేం చేయలేమా?"

"ఆ ప్రవర్తన ఆ పరిస్థితుల్లో సహజం అన్నాను కానీ, నేను సమర్ధించలేదే. దానికి వేరే పద్ధతులున్నాయి. మా సంస్థ చేసే పని అదే. కొంతమంది సైకాలజిస్ట్‌లు కూడా వాలంటరీ వర్క్ చేస్తుంటారు. వాళ్ళ చేత ఇద్దరికీ కౌన్సెలింగ్ చేయిద్దాం"

"అతను వింటాడని నేను అనుకోను" అన్నాడు నాగరాజు.

"వినడు. ఇలాటి కేసుల్లో అదికూడా సహజమే. దానికికూడా నయానా భయానా పద్ధతులున్నాయి"

నాగరాజు ఒక్క క్షణం ఆలోచించి అన్నాడు "కొంచెం ఆగుదాం. మరీ తొందర పడటం మంచిది కాదేమొ..."

"ఆగటం మంచిది కాదు. ఇప్పటికే ఇది చాల ముదిరి పోయిందనిపిస్తున్నది నాకు. ఆ తెగింపన్నది ఆవిడ దగ్గర నించే రావాలి. అదక్కడ నించీ రానప్పుడు చాల ప్రమాదం. అలాటి కథలకి ముగింపు కూడా చాల సీరియస్‌గానే వుంటుంది. అందుకే ఆమెలో ఆమార్పు రానప్పుడు మనం బయటనించీ కల్పించుకోవలసిన అవసరం వుంది" అన్నది నిరుపమ.

"నన్ను కొంచెం ఆలోచించుకోనీ. ఐ విల్ కాల్ యు బాక్! థాంక్స్ ఫర్ యువర్ హెల్ప్!" ఫోన్ పెట్టేశాడు నాగరాజు.

అది జరిగిన మర్నాడే, రాత్రి ఎనిమిది గంటలకి, నాగరాజు ఇంటికి ఏడుస్తూ వచ్చింది సరళ. ఆమె జుట్టంతా రేగిపోయివుంది. ముక్కులో నించీ రక్తం కారుతున్నది.

ఆమె వచ్చిన రెండు నిమిషాలకే, లోపలికి దూసుకు వచ్చాడు భాస్కర్.

ఈసారి సరళ ఏమీ భయపడకుండా అన్నది "నేనింక నీతో రాను. వస్తే నన్ను చంపుతావు" అని.

"నేను నిన్నెందుకు చంపుతాను. నువ్వు నా బంగారు బాతువి. ఇంటికి పోదాం రా!" అన్నాడు.

అప్పుడే భాస్కర్ నిజ స్వరూపాన్ని చూశారు, నాగరాజూ, శారద.

"నేను రాను" అంది సరళ ధృఢంగా.

భాస్కర్ ముందుకు వచ్చి, సరళ చేయి పట్టుకుని "వీళ్ళు పక్కనే వున్నారని ధైర్యమా. ఎవరేం చేస్తారో చూద్దాం. నువ్వు నా పెళ్ళానివి" అని బలంగా లాగాడు.

"అమ్మా!" అని బాధగా అరిచింది సరళ.

శారద అతన్నోసారి ఏహ్యభావంతో పురుగుని చూసినట్టు చూసి, గబగబా మేడ మీదకు వెళ్ళింది, అందర్నీ అక్కడే వదిలేసి.

నాగరాజు భాస్కర్‌కి అడ్డం వచ్చాడు "భాస్కర్! ఏం చేస్తున్నావ్!" అని.

"అది నీకనవసరం. నా పెళ్ళాం. నా ఇష్టం" అన్నాడు భాస్కర్.

"భాస్కర్! నీకే చెప్పేది. సరళని వదులు ముందు"

భాస్కర్ సరళ చేయి పట్టుకుని మళ్ళీ లాగాడు.

"భాస్కర్! గెటవుట్ ఆఫ్ మై హౌస్" అరిచాడు నాగరాజు.

"వెళతాను. సరళని తీసుకునే వెడతాను!" అన్నాడు భాస్కర్.

ఆమెని బరబరా లాగుతూ తలుపు తెరిచి, డ్రైవ్వేలోకి లాక్కు వెళ్ళాడు.

సరళ తప్పించుకుని లోపలికి వచ్చి, చటుక్కున తలుపు వేసింది.

బయట తలుపు బాదుతున్నాడు భాస్కర్. కాలింగ్ బెల్‌ని అదే పనిగా మ్రోగిస్తున్నాడు.

నాగరాజు సరళని సోఫాలో కూర్చోబెట్టి, "శారదా! ఎక్కడున్నావ్!" అని అరిచాడు.

శారద మేడ మీదనించీ పరుగెత్తుకు వచ్చింది. సరళని దగ్గరకి తీసుకుంది. ఆమె భుజం మీద ఒక చేయి వేసి, రెండో చేత్తో వీపు నిమిరింది.

సరళ కళ్ళల్లో ఇప్పుడు నీళ్ళు లేవు, ఇంకి పోయాయో, కోపానికి ఆవిరిఅయి పోయాయో కానీ.

ఈలోగా నాగరాజు ఇంటి ముందు ఒక పోలీసు కారు ఆగింది. ఎరుపూ, నీలం రంగు లైట్లు వెలుగుతూ, ఆరుతూ, ఆ రోడ్డంతా కాంతివంతంగా వుంది.

మేడ మీదకు వెళ్ళి, పోలీసులకి ఫోన్ చేసిన శారద వేపు ఆప్యాయంగా చూశాడు నాగరాజు.

సరళతో అన్నాడు నాగరాజు – "ఇప్పుడంతా నీ స్టేట్‌మెంట్ మీద ఆధారపడి వుంది సరళా. నీ జీవితం. నీ ఇష్టం. ఆలోచించుకో... " అని తలుపు తీశాడు.

భాస్కర్ డ్రైవ్వేలో బోర్లా పడుకుని వున్నాడు. అతని చేతులు వెనక్కి విరిచి బేడీలు వేస్తున్నారు ఇద్దరు పోలీసులు. ఒక పోలీస్ ముద్దాయిగా భాస్కర్‌కివున్న హక్కులేమిటో వివరిస్తున్నాడు.

నాగరాజు తలుపు తీయటం చూసి, ఒక పోలీసు లోపలికి వచ్చాడు.

నాగరాజు సరళతో అన్నాడు – "పోలీసులు భాస్కర్‌ని అరెస్ట్ చేశారు. నీ స్టేట్‌మెంట్ కోసం వచ్చారు. ఇస్తావా?"

సరళ కళ్ళు ధృడ నిశ్చయంతో మెరుస్తున్నాయి.

"ఆ మృగానికి, బయట మనుషులున్న సభ్య ప్రపంచంలో వుండే అర్హత లేదు. తప్పకుండా స్టేట్‌మెంట్ ఇస్తాను" అంది.

పోలీస్ ఆమె దగ్గర కూర్చుని, ఆమె చెప్పేది టేప్ చేస్తున్నాడు.

కథ చెప్పటం ఆపాడు సూతుడు.

"ఆమెకు ఆర్థికంగా ఎలా మరి?" అడిగింది ఎర్రకోతి.

"మరి పచ్చ కార్డో... " అన్నది ఆకుపచ్చని రామచిలుక.

"అమెరికాలో చాల రాష్ట్రాల్లో, ఆస్థిపాస్తులన్నీ రాత కోతలెలావున్నా భార్యాభర్తలిద్దరికీ సమానంగా చెందుతాయి. ఇక్కడ కూడా అంతే. కనుక అదొక సమస్య కాదు. సరళ కూడా భాస్కర్ చదువుకున్నంతే చదువుకుని, అతనిలాగానే మంచి ఉద్యోగం చేసుకుంటున్న వ్యక్తి. వాళ్ళ కంపెనీ ఏ రూల్స్ ప్రకారం అతన్ని గ్రీన్ కార్డుకి స్పాన్సర్ చేస్తుందో, ఆ రూల్స్ ప్రకారమే ఆమెకూ చేస్తుంది. కాకపోతే కొంచెం ఆలస్యమవుతుందేమో. కనుక అదీ ఒక సమస్య కాదు"

చిన్నముని "అయినా గురువుగారూ! రామేశ్వరం పోయినా శనేశ్వరం తప్పలేదని, అమెరికా పోయినా ఈ తిరకాసేమిటండీ?" అన్నాడు.

సూతుడు నవ్వి– "ఇది నా కళ్ళతో చూసిన కథ చిన్నముని. శంకించకు. ఒక గదిలో బంధించి బాదుతుంటే, ఆ బాధ భరించలేక పిల్లి పిల్ల కూడా పులిలా తిరగబడుతుంది. అటువంటిది చదువుకున్న పిల్ల, తెలివైన మనిషి, సరళ తిరగబడటం సహజం నాయనా!" అన్నాడు.

"మీరు చెప్పింది సబబే అని ఒప్పుకుంటాను కానీ, మరి లంచగొండి రాజకీయ

గూండాలు, ఉగ్రవాదులూ, మాఫియాలు కలిసి, న్యాయం, ధర్మం, నీతి, నైతిక విలువల నే వలువల్ని వలిచేస్తే, సిగ్గుతో నగ్నంగా పొయ్యిలో పిల్లిలా పడుకున్న భారతమాత, పులిలా ఎప్పుడు తయారవుతుందంటారు?" అడిగాడు చిన్నముని అమాయకంగా.

సూతుడు చిరునవ్వు నవ్వి, దురద పెడుతున్న గడ్డాన్ని మరొక్కసారి, చేత్తో నిమురుకున్నాడు.